ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.45, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 65, క్యాప్సికం 55, పచ్చకాకర 26, పందిరి బీర 40, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 33, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 55, గోకరకాయ 47, కీర 23, దోసకాయ 13, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 26, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

చారుకొండ ప్రశాంతికి ఓయూ డాక్టరేట్



లాలాపేట: ఓయూ పీజీ న్యాయ కళాశాల తాత్కాలిక అధ్యాపకురాలు చారుకొండ ప్రశాంతికి ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఓయూ లా కళాశాల సీనియర్ అధ్యాపకులు ప్రొఫెసర్ జీబీ రెడ్డి పర్యవేక్షణలో 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ప్రొటెక్షన్ ఫర్ జెనిటిక్స్ రిసోర్సెస్ ట్రెడిషనల్ నాలెడ్జ్ అండ్ ట్రెడిషనల్ కల్చరల్ ఎక్స్‌ప్రెషన్స్–ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. భారతదేశంలో మేధో సంపత్తి ఆస్తుల రక్షణ విషయంలో కొత్త చట్టాల ఆవశ్యకతను తన పరిశోధన ద్వారా ప్రశాంతి వివరించారు. ఇందుకు గాను డాక్టరేట్‌ను ప్రకటించింది.

చెట్టు తరలింపు



చెట్టుకు పూజలు చేస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతంలోని ఓ చెట్టును ట్రాఫిక్ పోలీసులు మరోప్రాంతానికి తరలించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు చెట్టును ఇక్కడి నుంచి మహబూబ్ కళాశాలకు తరలించారు.

ఇంజినీరింగ్ ఫీజుల పెంపు సరికాదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ కోర్సుల ఫీజుల పెంపు సరికాదని తక్షణం వెనకిక తీసుకోవాలని ఆర్ఎస్ఏ అధ్యక్షుడు ఆజాద్ మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత ఫీజులతో ప్రవేశం పొందిన విద్యార్థులకు పెంచిన ఫీజులతో ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. బీ కేటగిరి సీట్ల విక్రయాల దందాను అరికట్టి విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాల అపహరణ

సికింద్రాబాద్: రైల్లో ప్రయాణిస్తున్న మహిళా మెడలోంచి గొలుసు, మంగళసూత్రం అపహరించారు ఆగతంతకులు. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నగరంలో నివాసం ఉంటున్న జక్కుల సుధ (56), ప్రదీప్ నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి మంచిర్యాలకు వెళ్లేందుకు మంగళవారం తెల్లవారుజామున సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరారు. వారు నిద్రలోకి జారుకున్నాక అప్పటికే బోగీ గేట్ దగ్గర వేచి ఉన్న ఇద్దరు వ్యక్తులు ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో అంకుషాపూర్ వద్ద గల రైల్వే క్రాస్ వద్ద రైలు వేగం తగ్గగానే సుధ మెడలోని 30 గ్రాముల బంగారు గొలుసు, రెండు మంగళసూత్రాలను లాక్కొని రైలు దిగి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

అమీర్‌పేట: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు. యూసుఫ్‌గూడలోని ఓ బట్టల షాపులో షిండే అఖిల్(20) యువకుడు సేల్స్ బాయ్‌గా, హెచ్.రవి (19) బంగారు దుకాణంలో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరు కలిసి మహారాష్ట్రలోని బార్లీ జిల్లా కేంద్రం నుంచి గంజాయి తీసుకువస్తున్నారనే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులు సోమవారం బేగంపేట రైల్వేస్టేషన్‌లో రైలు దిగి అక్కడ ఎంఎంటీఎస్ రైలు ఎక్కి నేచర్‌క్యూర్ ఆసుపత్రి స్టేషన్‌లో దిగి బీజేజేఆర్ నగర్‌కు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి తదుపరి విచారణ కోసం ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

లష్కర్‌కు సుస్తీ..!



కాలనీలు, బస్తీల్లో విజృంభిస్తున్న విష జ్వరాలు

- పిల్లలకు న్యుమోనియా, డెంగీ, మలేరియా బారిన పెద్దలు
- ఆసుపత్రులకు క్యూ కడుతున్న రోగులు
- గాంధీకి రెఫర్ చేస్తున్న వైద్యాధికారులు
- అప్రమత్తమైన ప్రభుత్వ విభాగాలు

సికింద్రాబాద్: వారాసీగూడకు చెందిన రోహిత్ ఇంజినీరింగ్ విద్యార్థి. వారం క్రితం తలనొప్పి, జ్వరం బారిన పడ్డాడు. సాధారణ మందులతోనే నయమవుతుందని సరిపెట్టారు. అయితే రోజురోజుకు జ్వరం తగ్గకపోగా నీరసం పెరుగుతుండడంతో ఆసుపత్రికి తీసుకెళఆలరు. పరిస్థితి విషమిస్తుందని ప్రభుత్వాసుపత్రి వైద్యులు హెచ్చరించగానే సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు టైఫాయిడ్ సోకినట్టు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు.

- మెట్టుగూడ ఆలుగడ్డబావికి చెందిన రమణమ్మ 4 రోజుల క్రితం అనారోగ్యానికి గురి కాగా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు డెంగీ బారిన పడ్డారని నిర్ధారించి గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఇది ఈ ఇద్దరి పరిస్థితి మాత్రమే కాదు. సికింద్రాబాద్ ప్రాంతంలోని చాలా బస్తీల్లోని పిల్లలకు అంటు వ్యాధులతో పాటు న్యుమోనియా, పెద్దలకు డెంగీ, మలేరియా జర్వాలు సోకుతున్నాయి. గడిచిన 30 రోజులుగా వైరల్ ఫీవర్లు సోకుతున్న వారి సంఖ్య పెరిగిపోతున్నదని సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

ఆసుపత్రులకు బారులు..

దోమల నివారణకు జీహెచ్ఎంసీ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజలు విష జ్వరాల బారిన పడుతుండడం గమనార్హం. నియోజకవర్గంలో 6 పీహెచ్‌సీలు, 7 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. జూలై మొదటి వారం నుంచి ఆసుపత్రులకు వస్తున్న ప్రతి 10 మందిలో సాధారణ వైద్యంతో 2,3 రోజుల్లో 6 గురు కుదుట పడుతుండగా నలుగురికి విషజర్వాలు సోకుతున్నట్టు వైద్యులు నిర్ధారిస్తున్నారు. మరోవైపు పిల్లలు జ్వరాల బారిన పడుతుండడంతో పాటు న్యుమోనియాతో బాధపడుతున్నారు.



రోగితో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రత్యూష

విషజ్వరం బారిన 100 మంది..

అడ్డగుట్ట, చంద్రబాబునాయుడు నగర్, మెట్టుగూడ, వారాసీగూడ బస్తీల్లోని నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ ప్రాంతాలకు చెందిన 500 మంది జ్వరాల బారిన పడినప్పటికీ ఇందులో 105 మందికి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు సోకినట్టు వైద్యులు నిర్ధారించారు. ఇందులో 36 మంది ఆరోగ్యం కుదుట పడగా మిగతావారంతా గాంధీతో పాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఇంటింటి సర్వేతో కట్టడి..

సికింద్రాబాద్ ప్రాంతంలో విష జ్వరాల కట్టడికి వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య ఆధారంగా అనారోగ్యం బారిన పడుతున్న బస్తీలను గుర్తిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వైద్యారోగ్య శాఖకు చెందిన బృందాల ప్రతినిధులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈనెల రెండో వారం నుంచి సర్వే ప్రారంభించిన వైద్యా బృందాలు ఇప్పటివరకు 1,586 మందిని పరీక్షించారు. ఇందులో 480 మంది రక్త నమునాలు సేకరించి పరీక్షల కోసం ఆసుపత్రులకు పంపించగామిగతా వారికి మందులు అందించి ఇంటికే పరిమితం కావాలని సూచిస్తున్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

అధికారుల అప్రమత్తం

జ్వరాల నివారణకు వైద్యారోగ్య శాఖ అధికారులు సికింద్రాబాద్ ప్రాంతంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానల్లో సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచారు. అలాగే వైద్య బృందాల ద్వారా బస్తీల్లో సర్వే నిర్వహిస్తున్నారు. సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యం పనులు వేగవంతం చేశామని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు చెప్పారు. నాలా పరీవాహక ప్రాంతాల్లో దోమలను అరికట్టేందుకు మందులు పిచికారీ చేయడంతో పాటు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మరోవైపు జలమండలి అధికారులు సైతం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. కలుషిత జలాల నివారణకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లీకేజీలకు సంబంధించిన సమస్యలపై తక్షణమే స్పందించి సత్వర చర్యలు తీసుకుంటున్నారు.


ఘనంగా ఏఎండీ వ్యవస్థాపక దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేఎస్ వ్యాస్ తదితరులు

సనత్‌నగర్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీకి చెందిన అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎండీ) 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. 7 ప్రాంతీయ కేంద్రాలు (న్యూఢిల్లీ, బెంగుళూరు, జంషెడ్‌పూర్, షిల్లాంగ్, జైపూర్, నాగ్‌పూర్, చర్లపల్లి–హైదరాబాద్), మూడు సెక్షనల్ కార్యాలయాలు (తిరువనంతపురం, విశాఖపట్నం, కోల్‌కత్తా) అంతటా ఏకకాలంగా వేడుకలు జరగ్గా బేగంపేట ప్రధాన కార్యాలయంలోని డాక్టర్ హోమిబాబా ఆడిటోరియంలో అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హోమిబాబా చైర్ ప్రొఫెసర్, అటానమిక్ ఎనర్జీ కమిషన్ మాజీ చైర్మన్ అండ్ డీఏఈ కార్యదర్శి కేఎస్ వ్యాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హై–గ్రేడ్ యురేనియం నిక్షేపాల అన్వేషణను మరింత వేగవంతం చేయాల్సిన అవసరముందన్నారు. ఏఎండీ సామర్థ్యాలు పెంచేందుకు ఇంటర్–డీఏఈ సహకార ఆర్అండ్‌డీని ఆయన సూచించారు. భారతదేశ గ్రీన్ ఎనర్జీ పరివర్తనకు కీలకమైన అరుదైన లోహాలు, అరుదైన భూమి మూలకాల అవసరాన్ని తెలియజేశారు. ఏఎండీ వైవిధ్యభరితమైన అన్వేషణ సామర్థ్యాలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఎండీ శాస్త్రవేత్తలు శరవణన్, ఎల్‌కే నందా, డైరెక్టర్ ధీరజ్‌పాండే, అదనపు డైరెక్టర్ ప్రేమ్‌కుమార్‌శర్మతో పాటు పలువురు రిటైర్డ్ ఏఎండీ భూశాస్త్రవేత్తల హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా కేఎస్ వ్యాస్ డ్రిల్లింగ్ రిగ్ ప్రదర్శనను ఆవిష్కరించారు. అలాగే వేదికపై జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎల్లమ్మకు లక్ష పుష్పార్చన



అమీర్‌పేట: శ్రావణ మాసం మొదటి మంగళవారం సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

పకడ్బందీ ఓటరు జాబితాకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు

సికింద్రాబాద్: నూతన ఓటరు జాబితా కోసం రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, సికింద్రాబాద్ ఎన్నికల అధికారి ఆంజనేయులు కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల నాటికి ఒక భవనంలోని కుటుంబాలకు చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్‌బూత్‌లో ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఒక బూత్‌లో 1200 ఓటర్లు మాత్రమే ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకోసం బీఎల్‌ఓల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. బూత్‌లెవల్ ఆఫీసర్లు సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసి నజరీనక్షాలు రూపొందిస్తున్నామన్నారు. ఓటర్ల పేరు చిరునామా వివరాలు తప్పుల్లేకుండా నమోదు, అర్హత గల యువతీయువకుల పేర్లు ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేలా చూస్తున్నామన్నారు. సమావేశంలో సికింద్రాబాద్, మారేడుపల్లి తహసీల్దార్లు భూమయ్య, పాండునాయక్, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానర్ పావని, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సంధ్యారాణి, ఎన్నికల విభాగం అధికారి పవన్, బీఆర్ఎస్ నాయకుడు రాజసుందర్, కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డి, ప్రవీణ్‌లాల్, బీజేపీ నాయకులు ప్రకాశ్‌గౌడ్, నగరపు శ్యాం, సీపీఐ నాయకుడు కాంపెల్లి శ్రీనివాస్, బీఎస్‌పీ నాయకుడు నర్సింగరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు



అమీర్‌పేట: మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నివాసానికి వెళ్లే రోడ్డు మార్గంలోని 250 గజాల స్థల వివాదం ప్రైవేటు, ప్రభుత్వం మధ్య చాలా కాలం నుంచి కొనసాగుతోంది. అయితే స్థలం ప్రభుత్వానికి చెందిందని సూచిస్తూ రెవెన్యూ అధికారులు రెండు చోట్ల బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే స్థలంపై కన్నేసిన కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రే బోర్డు తొలగించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు మంగళవారం తిరిగి బోర్డులను ఏర్పాటు చేయించారు. స్థలం పక్కన ఉన్న చెరుకు జ్యూస్ బండిని సైతం తొలగించినట్లు అమీర్‌పేట తహసీల్దార్ పద్మసుందరి తెలిపారు. స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

నాగుల పంచమిని పురస్కరించుకుని మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పుట్టల్లో పాలు పోసి, గుడ్లు, అరటిపళ్లు, జొన్న ప్యాలాలు నైవేద్యంగా సమర్పించారు. –సనత్‌నగర్, బౌద్ధనగర్, చిలకలగూడ, బన్సీలాల్‌పేట్



పుట్టలో పాలు పోస్తున్న మహిళలు






విద్యాశాఖ మంత్రిని నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని తెలంగాణ స్టూడెంట్ పరిషత్ (టీఎస్‌పీ) నాయకులు డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేతిలో కీలక శాఖలు విద్య, హోం శాఖలు ఉన్నాయని దీంతో సరైన న్యాయం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్, మెస్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వడ్డే గణేశ్, వెంపటి సురేశ్, నరేశ్, సైదులు, గిరి, మనోజ్, శంకర్, సతీశ్, రాజు సూర్య పాల్గొన్నారు.

గణేశ్ చతుర్థి సందర్భంగా..

సీపీసీబీ మార్గదర్శకాల జారీ • అమలుకు టీజీపీసీబీ సిద్ధం



సనత్‌నగర్: గణేశ్ చతుర్థి వేడుకల సందర్భంగా పర్యావరణ అనుకూల విగ్రహాల నిమజ్జనం కోసం కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) మార్గదర్శకాలు జారీ చేసింది. గతంలో ఉన్న కొన్నింటిని సవరించింది. సీపీసీబీ సమన్వయంతో తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు (టీజీపీసీబీ) ఆయా మార్గదర్శకాలను అమలు చేసేందుకు సిద్ధమైంది. విగ్రహ నిమజ్జనానికి సంబంధించి పెరుగుతున్న ఆందోళనల దృష్ట్యా కీలక ఆదేశాలు జారీ చేశారు. వాటిని భక్తులు తూ.చ. తప్పకుండా పాటించాలని టీజీపీసీబీ అధికారులు సూచిస్తున్నారు.

- ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ లేదా ఇతర బయోడిగ్రెడబుల్ కానీ పదార్థాలకు బదులుగా సహజ బంకమట్టితో తయారుచేసిన విగ్రహాలను ప్రతిష్ఠించాలి.
- నీటి వనరుల రసాయన కాలుష్యాన్ని తగ్గించేందుకు విగ్రహాలను చందనం (గంధం), పసుపు, గెరువా (ఎర్ర ఓచర్) వంటి బయోడిగ్రెడబుల్ ఆర్గానిక్ రంగులతో అలంకరించాలి.
- స్థానిక అధికారులు విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేకంగా తాత్కాలిక కృత్రిమ చెరువులు లేదా ట్యాంకులను సృష్టించి నిర్వహించాలి.
- సహజ జల వనరులు రక్షించేందుకు నిమజ్జన కాలం అంతటా కృత్రిమ పాండ్‌ల నిర్మాణం చేపట్టాలి.
- పర్యావరణానికి విఘాతం కలగకుండా నిమజ్జన చెరువుల్లో నిలిచిపోయిన అన్ని రకాల మురుగునీటిని పటిక లేదా సున్నం ఉపయోగించి ముందే శుద్ధి చేయాలి.
- నిమజ్జన ప్రక్రియలో ఉత్పన్నమయ్యే ఘన వ్యర్థాలను 2016 ఘన వ్యర్థాల నిర్వహణ నియమాల ప్రకారం సేకరించి తరలించాలి.
- భక్తులు, మట్టి విగ్రహ తయారీదారులు, పూజా పండళ్లు, విక్రేతలు మార్గదర్శకాలను పాటించి పర్యావరణ స్పృహతో కూడిన వేడుకల్లో భాగస్వాములు కావాలి.
- విద్యా ప్రచారాలు, అవగాహన డ్రైవ్‌లు నిర్వహించబడతాయన్నారు.
- నదులు, నీటి వనరులను రక్షించడం, నీటి నాణ్యతను మెరుగుపర్చేందుకు ఆయా మార్గదర్శకాల అమలులో స్థానిక సంస్థలు కీలకంగా వ్యవహరించాలన్నారు. వీటి అమలును టీజీపీసీబీ, సీపీసీబీలు పర్యవేక్షిస్తాయని చెప్పారు.
- సరస్సులు, చెరువులు సహా నీటి వనరుల పరిరక్షణ, పునరుద్ధరణ, పర్యావరణాన్ని కాపాడే బాధ్యతలు నిర్వర్తించడం, అవగాహన కార్యక్రమాలను చేపట్టడం టీజీపీసీబీ కీలక బాధ్యతగా అధికారులు పేర్కొన్నారు.

సీఎం చొరవతోనే కంటోన్మెంట్‌కు పరిహారం

కంటోన్మెంట్: సీఎం రేవంత్ రెడ్డి చొరవతోనే ఎలివేటెడ్ కారిడార్ కోసం సేకరించిన భూముల పరిహారం సొమ్ము కంటోన్మెంట్‌కే దక్కిందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. రామన్నకుంట ముంపు ప్రభావిత కాలనీలైన మర్రిరాంరెడ్డి, సీతారాంపూర్ తదితర కాలనీవాసులు మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటోన్మెంట్ భూముల పరిహారం కేంద్రానికి వెళ్లకుండా ఇక్కడే వినియోగించేలా అవకాశం ఇవ్వాలంటూ రాష్ట్రం కేంద్రానికి లేఖ రాసిందన్నారు. ఈ మేరకు కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌తో పాటు, మాజీ సీఈఓ, ప్రస్తుత సీఎం కార్యాలయ సెక్రటరీ అజిత్ రెడ్డి పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ నిధులతో కంటోన్మెంట్‌లో చేపట్టబోయే నాలాల ఆధునికీకరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో భాగంగానే మర్రి రామిరెడ్డి కాలనీ గుండా వెళ్లే ఓపెన్ డ్రైనేజీ లైన్‌ను ఆధునీకరిస్తామన్నారు. కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాలనీల అధ్యక్షులు సంపత్ కుమార్ రెడ్డి, చెన్నకేశవులు, మాల్యాద్రి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇస్మాయిలీ కమ్యూనిటీ ఆధ్వర్యంలోని అగాఖాన్ సోషల్ వెల్ఫేర్ బోర్డు పర్యావరణ పరిరక్షణలో భాగంగా బోయిన్‌పల్లిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్‌విత్ ఇంటలెక్చువల్ డీసెబిలిటీస్–నీపెడ్ (దివ్యాంగ్జన్)లో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఎన్నో రకాలుగా సేవలిందిస్తున్న నీపెడ్ సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరపున కూడా సహకారం అందిస్తామన్నారు.



మొక్కలు నాటుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే శ్రీగణేశ్

కో-లివింగ్ హాస్టల్స్‌కు అడ్డుకట్ట వేయండి



మాట్లాడుతున్న జాజుల లింగం గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలో కో–లివింగ్ (వివాహం కానీ యువతి, యువకులు) హాస్టల్స్‌కు అడ్డుకట్ట వేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ సంస్థల ప్రాంతాలు మాదాపూర్, హైటెక్‌సిటీ, కొండాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, రాయదుర్గం, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాల్లో కో–లివింగ్ కల్చర్ కొనసాగుతుందని మరింత విస్తరించకముందే ప్రభుత్వం నియంత్రించాలన్నారు. ధనార్జెన లక్ష్యంగా హాస్టల్స్‌ను విలాసవంతంగా అలంకరించి యువతను ఆకర్షిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థి నేతలు బూర శ్రీనివాస్, గోదా రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

చలో ఢిల్లీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పాల్గొనడాన్ని స్వాగతిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు పార్లమెంట్‌లో ఆమోదం కోసం ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో చేపట్టిన ఆందోళనలో రాష్ట్ర మంత్రులు పాల్గొనడం హర్షనీయమన్నారు.

ట్రాఫిక్ రద్దీ నివారణకు చర్యలు చేపట్టండి

అడ్డగుట్ట: తుకారాంగేట్ ఆర్‌యూబీ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు కోరారు. ఈ మేరకు పలువురు తుకారాంగేట్ వాసులు మల్కాజ్‌గిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. గౌతంనగర్, మల్లికార్జున్ నగర్, హనుమాన్‌పేట్ నుంచి వచ్చే వాహనాలు తుకారాంగేట్‌లోని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ దారి గుండా రావడం వలన తుకారాంగేట్ ఆర్‌యూబీ వద్ద విపరీతమైన ట్రాఫిక్ జాం అవుతుందన్నారు. అందువల్ల జ్యోతినగర్ క్రాస్ రోడ్డు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేసి లాలాగూడ రైల్వేస్టేషన్ మీదుగా వాహనాలను వెళ్లేలా చూడాలని కోరామన్నారు. సీనియర్ నాయకులు సత్యనారాయణ, సంజుకుమార్ పాల్గొన్నారు.



మార్కెట్‌లో సదుపాయాలు కల్పించండి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మార్కెట్ కమిటీ సభ్యులు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్ర మోహన్, లక్ష్మీబాయిని మంగళవారం కలిసి విన్నవించారు. మార్కెట్ ఏర్పాటై 2 దశాబ్దాలు గడుస్తున్నా, తాగునీటి సౌకర్యం లేదన్నారు. కంటోన్మెంట్ బోర్డు అధికారులకు విన్నవించగా సానుకూలంగా స్పందించినప్పటికీ, మార్కెటింగ్ శాఖ నుంచి పాలనా అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. మార్కెటింగ్ శాఖ నుంచి రూ. కోటి వరకు నిధులు రావాల్సి ఉందని తెలిపారు. యార్డులో రోడ్లు, డ్రైనేజీ లైన్లను సైతం ఆధునికీకరించాల్సి ఉందన్నారు.



మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌తో చైర్మన్ ఆనంద్ బాబు